# నగరం నడివీధిలో

అతడెవడు?–ఎవరికీ తెలియదు.

అతడెక్కడనుండి వచ్చాడు – అదీ తెలియదు.

కాని అతడిని చూసిన వారందరికీ ఒక్కటి మాత్రం తెలుసు...

అతడు ఆ మహానగరపు పెద్దబజారులో హద్దులేని రద్దీతో వుండే వీధి పక్కన పడుకుని వున్నాడు–అని తెలుసు.

నిజానికి అతడు పడుకుని వున్నాడనడంకన్న 'పడివున్నాడు–' అనడం సబబుగా వుంటుంది.

శుభ్రమైన పొడుగాటి ఆ పెద్దరోడ్డు నాగరికత మీద మచ్చలాటి ఆ మనిషి అక్కడకు ఎప్పుడు వచ్చి పడ్డాడు? ఏమో!

అంతకు క్రితం సాయంత్రం అతడక్కడలేడు.

నిజంగా లేడా అని ఆ బజారు వెంబడి నడిచే, వచ్చే, వెళ్లే, పోయే వేలాది నాగరికుల నెవరి నడిగినా బుర్రగోక్కుంటారు. ఎవడో కోన్‌కిస్కా గాడు, ఎదుటవున్నప్పుడే గుర్తుండవివాడు, లేనప్పుడు వాడులేడని ఎలా గుర్తుంటుంది? నగరంలోని రాజులకు, తరాజులకు, మహారాజులకు, వారి వారి రాణీమణులకు ఇట్లాంటి అల్లాటప్పయ్యలను గుర్తుంచుకోవడమే పనా, ఏమిటి?

ఆ బుధవారం ఉదయం తొమ్మిదింటికి, ఆ నగరమంతటా ఎందరో మనుషులు, ఎందరెందరో మనుషులు, ఎన్నో ఎన్నో, స్వామికార్యాలమీద, స్వకార్యాలమీద, ఊపిరి తీసుకోవడానికి కూడా వీల్లేనంత ఉరుకులతో, పరుగులతో, అటూ ఇటూ, ఎటో ఎటో, రయమున, రయాతిరయమున ఎగురుతూ, తిరుగుతూ వుండగా – నల్లటి వెడల్పాటి రోడ్డును తెల్లటి చారలు అరుబాటలుగా చీల్చినచోట, మసీదు కివతల, బురుజు గుమ్మందాటగానే, వెండి బజారుమీద మొగదల, కాలిబాటకడ్డంగా ఏదో పడి వుండడం గమనించారా... బహుశః గమనించే వుంటారని అనుకోవచ్చును.

గడియారాలను చూసుకునేవాళ్ళు, రోడ్డును దాటడానికి అదనుకై ఎదురుచూసేవాళ్ళు, టాక్సీల నాటోర్రిక్షాల నాపడానికై నించున్నవాళ్ళు, రానిబస్సుల కోసం పొంచున్నవాళ్ళు, ఒక అఫీసుకాలం లేటయి వచ్చి కూడా ఆగని బస్సులవెంబడి పరుగులిడేవాళ్ళు, నేల మీద తప్ప ఇతరత్రా చూపులు చూస్తున్న ఊర్ధ్వముఖులు, ఉన్నట్లుండి – ఆ చోటికి వచ్చేసరికి, తమ కాలికి ఏదో తగలబోయినంత పనవగా, ఆ కాస్త పనికాకుండా తొట్రుపడి, తట్టుకుని అరక్షణం నిలబడ్డారు. లీలగా దారికడ్డంగా ఏదో పడివుందన్న విషయాన్ని గుర్తించేసుకుని, మరుక్షణం గిరుక్కున మరలి అటుతిరిగి యథాప్రకారం తమతమ పథాల వెళ్లిపోతున్నారు.

వారి దారి ఇదని తెలియకుండా, వారి కాలమీలాగున వృధా చేయరాదన్న మర్యాద తెలియకుండా, ఆ దేహం అడ్డంగా పడివుంది. చర్మానికి సున్నం పూయగా అది, కాస్త పాతపడినట్లన్పిస్తున్న చొక్కా, దాని తమ్ముడిలాటి పంట్లాము వున్నాయి. ఆ దేహంమీద, ఆవేలాది జనులలో ఎవరో కొందరు క్షణంలో సగంసేపు తీరికచేసుకుని, ముఖం వుండాల్సినచోట చూస్తే, ముఖమువుంది. మాసిపోయిన గడ్డం వెనకాల దాగుకున్న ఆముఖంలో కళ్ళు అనేవి ఎనిమిది లీవర్ల తాళం కప్పలవలె మూతలుపడి వున్నాయి. ఆ కొందరిలో మరికొందరికి, ఇది మనిషా లేక మాజీ మనిషా అన్న సందేహం వచ్చింది. జాగ్రత్తగా గమనిస్తే చొక్కా అనబడే ఆ దానికింద కడుపు అనే భాగం ఎంతో అడకువతో, భయభక్తులతో, సిగ్గుతో పైకిలేచి కిందికి పడుతుండడం కనుపించింది. కాని ఆ మనిషికి దగ్గరగా వెళ్ళితే, జ్వరం వాసనలాటిది నాసికాపుటాలను పుటం పెడుతూంది గనుక పంగి చూడబోయినవాళ్లు తటాలున వెనక్కుమళ్ళి, మళ్ళీ వెళ్ళిపోతున్నారు.

అతడు చావలేదు. కాని బతికివున్నాడని గట్టిగా చెప్పడమూ కష్టమే. కాస్త ఇటుకన్న అటేగా వున్నట్లుంది అతడిధోరణి. కాని ఎవడిపనులు వాడికున్న ఈ లోకంలో, అందులోనూ ఈమహానగరంలో, అతగాడిగురించి పట్టించుకునేటంత తీరిక– అందులోనూ అఫీసుదినాన, పొద్దునవేళ ఎవడికి వుంటుంది? సాక్షాత్తూ ఆ పరమాత్ముడే వచ్చి నిల్చుని మోక్షమిస్తాను రమ్మని పిలిస్తే వినిపించుకోవడానికయినా అదనుండని ఆ సమయాన ఈ జీవచ్ఛవం మాటె వడిక్కావాలి? అయినా ఆ మూర్ఖుడిని ఇట్లాంటిచోటుకొచ్చి ఎవడు పడమన్నాడు? బుద్ధిలేని పీనుగు.....

ఓక్షణం ఆగినవాళ్లు మరుక్షణం వెళ్లిపోతున్నారు. మరుక్షణం మరికొందరాగుతున్నారు. వాళ్లూ ఏగుతున్నారు.

ఇట్లాంటి సమయంలో ఒక ముసలాయన, జీవితకాలం పరుగులిడి ఫించను పుచ్చుకున్నాయన, ఏదో పనిమీద వెళ్తున్నాయన అక్కడకు వచ్చి ఆగాడు. వంగి ముక్కుకడ్డంగా రుమాలు పెట్టుకుని పరిశీలించాడు. అమనిషి పక్కగా ముంగాళ్ళమీద కూర్చుని ఇంకాస్త శ్రద్ధగా చూశాడు.

ఓ నిముషం తర్వాత ముసలాయన "ఏమోయ్! ఎవరునువ్వు? నీకు ఒంట్లో ఎట్లావుంది?" అని గట్టిగా అడిగాడు. మళ్ళీ అడిగాడు. చుట్టూ పోగయిన అయిదార్గురు

చూస్తూనేవున్నారు. మూడోసారి ముసలాయన ప్రశ్నిస్తుండగా అతడికళ్ళు సగంలోసగం తెరుచుకున్నాయి. ఆ కళ్ళలో ఇంకా సన్నటి వెలుగుంది. ఆ వొత్తి ఇంకా కొడిగట్టలేదు. ఆ ఆకు ఇంకా రాలిపోలేదు.

అంతే, అరనిముషం అట్లా వెర్రిగా శూన్యంలోకి చూసినట్లు చూసిన ఆ మనిషికళ్ళు మళ్ళీ మూసుకున్నాయి.

అతడు మూగవాడా? కాదనిపించింది ముసలాయనకు.

ఆయన లేచి నెమ్మదిగా నడుచుకుంటూ జనాన్ని తోసుకుంటూ వెళ్ళాడు. ఎడతెగని ప్రవాహాలుగా వస్తున్న వాహనాలను దాటుకుంటూ వెళ్ళి నాలుగు రోడ్లమధ్య–ప్రభుత్వానికి ప్రతినిధిగా నిలబడివున్న పోలీసు కానిస్టేబుల్ ని సమీపించాడు.

"అక్కడ ఒకతను పడివున్నాడు" అన్నాడు ముసలాయన. రెండవసారి అదేమా టన్నాక, పోలీసు ఇటు తిరిగి "అవును" అని చెప్పేసి మళ్ళీ ఎటో చూడసాగాడు.

"అతడికి ఏదన్నా సాయంచేయాలి"– ముసలాయన అన్నాడు.

"చేయండీ!"

"మీరే ఏదన్నా బండిలాటిది ఏర్పాటు చేయించాలి."

"ఇప్పుడు వీలుకాదు. అవతల లక్షన్నర పనులున్నాయి."

"ఆలస్యమైతే ఆ మనిషి చచ్చిపోవచ్చు––"

"నన్నేమి చేయమంటారు? చచ్చిపోతున్న వాళ్ళని బతికించడం నా డ్యూటీకాదు."

పోలీసు హడావిడిలోకి మునిగిపోయాడు.

ముసలాయన గుండెమంటకు ప్రతిబింబంలా ట్రాఫిక్ దీపం ఎర్రగా వెలిగింది.

ఆ ఎర్రదీపం ఆపిన ఎన్నోకార్లలో, ఒక నీలి రంగుకారు, జపానునుండి నెలరో జులకింద దిగుమతి అయినదొకటుంది. దానిలోపల వెనుకసీటుపై బాలమ్మగారు కూర్చునివున్నారు.

బాలమ్మగారు ఆబాల గోపాలమ్మగారు. ఆమె చెయ్యని సంఘసేవలేదు. ఆమె ఫోటో పడని పత్రికలేదు. ఆమె ఎరుగని మంత్రిలేదు. ఆమె తిరగని దేశం లేదు. అట్లాంటి ఆ బాలమ్మగారివ్వాళ హడావిడిగా విమానాశ్రయానికి పరుగెడుతూ వుంటే దారిలో ఈ వెధవ ఎర్రదీపాలాపుతున్నాయి. ఆమెకు మా చెడ్డ చిరాకేసింది.

"ఇంకా ఎన్నినిముషాల్లో వెళ్తావోయ్?"

'మీకేం బెంగలేదమ్మా! విమానంకన్నా ముందుగా చేరిపోతాం' అని హామీ ఇచ్చాడు చోదకుడు అంజయ్య.

ఈలోగా కారు వెనక కిటికీ పక్కగా ఒక ముసలిమొహం అవతరించింది.

'అమ్మా!' అంది ఆ మొహం.

కళ్ళెగరవేసింది బాలమ్మ.

'తమర్ని నేనెరుగుదును. సమయానికి దేవతలా వచ్చారు. అవతల ఎవడో దిక్కులేనివాడు తీవ్రమయిన అనారోగ్యంతో చావు బతుకులమధ్య పడివున్నాడు....'

ఆయన్నింకా వివరాలు చెప్పనివ్వకుండా బాలమ్మగారు ఎంతో బాధతో, జాలితో– "చ్చొచ్చొచ్చొ! అయ్యో పాపం! నేనేమి చేయను చెప్పండి! ఇంక ఏడంటే ఏడే నిముషాల్లో ముఖ్య మంత్రిగారి విమానం వచ్చేస్తుంది. అయిదు మైళ్ళుంది ఇంకా. మధ్యలో వెధవ ఎర్రదీపాలు...మీకు తెలియనిదా. అంచేత క్షణం తీరిక లేకుండా వుంది. కాస్త మీరే ఏదో అస్పత్రికి పంపించేద్దురూ.....పంపించేసి సాయంకాలం నాకు ఫోన్ చేయండి..... ఇదిగో నా విజిటింగ్ కార్డు – పోనీ అంజయ్యా"

అంజయ్యా పోనిచ్చాడు.

ముసలాయన, చేతిలోవున్న విజిటింగ్ కార్డును ముక్కలు ముక్కలుగా చింపి, నలిపి, రోడ్ మీదికి విసిరికొట్టాడు.

రోడ్డును దాటివెళ్ళి చూశాడు.

అతడక్కడే వున్నాడు. అట్లాగే వున్నాడు. నలుగురైదుగురు నిల్చుని వున్నారు.

ముసలాయన ఈసారి ఒక దుకాణంలోకి వెళ్ళాడు. వన్‌టవున్ పోలీసుస్టేషన్‌కు ఫోన్ చేశాడు. విషయమంతా చెప్పాడు. "....వెంటనే అతడిని కాపాడేందుకు ఏదయినా చేయండి" అని కోరాడు.

'అయితే అతడింకా చచ్చిపోలేదన్నమాట–' అంది పోలీసుస్టేషన్ నుండి గొంతు.

'ఇంకో గంటవుంటే అంతపనీ అవుతుంది.'

'చచ్చి పడివుంటేగాని మేము ఏక్షన్ తీసుకోడానికి రూల్స్ లేవండీ' అంది ఆ గొంతు. దానిని పిసికేద్దామనిపించిది ముసలాయనకు. ఫోను దభీమని కిందపెట్టాడు.

మరికాస్సేపు ఆలోచించాడు.

మూడుమైళ్ళవతల మేయో అస్పత్రివుంది.

అక్కడికి ఫోన్‌చేసి అంబులెన్సును పంపమంటేనో....అది మంచిపని. డైరెక్టరీలో నెంబరు చూసి మేయో అస్పత్రి ఎమర్జెన్సీ వారెని పిలిచాడు. అంబులెన్స్ పంపమని అడిగాడు.

'ఇంతకూ అతగాడి జబ్బేమిటి?' అని అడిగింది అస్పత్రిగొంతు.

'అయ్యా! నేను రిటైరయిన గుమస్తా ముండాకొడుకును...ఆ వీధిని పడివున్నతని రోగమేమిటో అస్పత్రిలో డాక్టరు తేల్చాలిగాని నాకెట్లా తెలుస్తుంది చెప్పండి.'

'అబ్బే అదేం కుదరదండీ! అంబులెన్స్ రిక్విజిషన్ ఫారమ్‌లో ఒక కాలమ్ వుంది. దానిలో రోగముపేరు, మరియు ఎంతకాలమునుండి వున్నది? ఇత్యాది వివరాలన్నీ రాసితీరాలి.'

'సరే అయితే ముందువచ్చి ఇతడిని తీసుకువెళ్ళండి....నేనువచ్చి ఆ వివరాలను తర్వాత రాస్తాను.'

'కాని వెంటనే అంబులెన్స్‌లేవీ సిద్ధంగాలేవు.'

"ఒకటేమో ఆరెమ్‌ఓ గారింటి పెళ్ళికివెళ్ళింది. రెండో దాని వెనకచక్రం వారంరోజులకింద ఆక్సిడెంట్‌లో విరిగిపోయింది. దాని రిపేర్‌కని టెండర్లు పిలిపిస్తు న్నాము. ఇవ్వాళ పత్రికల్లో చూడలేదేమిటి?'– అని అస్పత్రిగొంతు చెబుతున్న కథపట్ల బొత్తిగా ఆసక్తిలేని ముసలాయన టెలిఫోను కిందపెట్టేసి, రెండు పిలుపులకూ కలిపి అర్థరూపాయి ఇచ్చుకుని బయటపడ్డాడు. మళ్ళీ రోడ్‌దాటి కాలిబాట మీదకు వచ్చాడు ముసలాయన. అతడి ముక్కు దగ్గర వేలుపెట్టి చూశాడు. ఒకమైలు అవతల ధర్మపురిలో మంత్రి దేవదాసుగారుండడం గుర్తుకువచ్చింది. రిక్షా కట్టించుకుని వారింటికి వెళ్ళాడు. మంత్రిగారు లేరు.

'ఇవాళ విజ్ఞానభవన్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థవారి సదస్సు జరుగుతూంది కదండీ... అందులో మెయిన్ స్పీచి అయ్యగారిదేనండీ..అంచేత రాత్రి ఏడింటిదాకా మీరాయన్ను కలవలేరు.' అని ఎంతో గర్వంగా చెప్పుకున్నాడు మంత్రిగారి పి.ఏ. అనబడే భృత్యుడు.

ముసలాయనకు కోపంవచ్చింది. ఎవరిమీద? అందరిమీద–ప్రపంచంమీద–దేవుడి మీద.....

కాని, తన కోపమే తన శత్రువు కాకపోయినా కనీసం మిత్రుడు కాదు కనక....ఈ స్థితిలో కోపం, అందులోనూ తనలాటి వాడికోపం ఏమీ సాధించలేదు అని తెలుసుకొని, కోపాన్ని మింగుకొని, ఆ తర్వాత దారి ఏమిటి అని ఆలోచించసాగాడు.

తన దగ్గరుండిన రూపాయిపావలా లో ఇంకముప్పై పైసలే వున్నాయి. వెండిబజా రుకు వెండియు వెళ్ళవలెనంటే కనీసం అర్థరూపాయన్నా అడుగుతాడు రిక్షావాడు. కనుక నడిచే వెళ్ళాలి. వెళ్ళి ఏదన్నా చేయాలి. చేసి అతడిని బతికించాలి.

నడుస్తున్నాడు ముసలాయన.

జీవితమంతా ఫైళ్ళమధ్య గడిపిన ముసలాయన, హెడ్‌గుమాస్తాగా రెండువందల పాతిక బేసిక్కు వచ్చేసరికి రిటైర్‌మెంట్ వయస్సువచ్చిన ముసలాయన, ఒక అబ్బాయిని ఓ.ఏ. చదివించి, ఇద్దరు కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేసినా, ఇంకా ఒక అబ్బాయీ ఒక అమ్మాయీ వుండిపోయిన ముసలాయన– జీవితంలో ఎక్కడో ఒక పున్నమి తప్ప చూచి ఎరుగని ముసలాయన.....నడుస్తున్నాడు.

మేనెల ఎండ నిర్దాక్షిణ్యంగా కాస్తున్నది.

ఉన్నట్లుండి కళ్ళ ఎదుట చీకటి తెరలు కమ్ముకున్నాయి. అతి కష్టంమీద ముసలాయన ఒక స్తంభాన్ని పట్టుకున్నాడు. కూలబడ్డాడు. అట్లాగే వాలిపోయాడు.

అక్కడ పడి వున్న మనిషిమీద కూడా అదే సూర్యుడు ధగధగ, భగభగ వెలుగుతున్నాడు.

అతడికిటూ అటూ ఎవరో పడేసిన పదిపైసల, ఐదుపైసల నాణాలున్నాయి.

ఎర్రదీపం వెలుగుతూ ఆరుతూవుంది.

పొద్దుటి పోలీసు వెళ్ళిపోగా మరోపోలీసు డ్యూటీలోకి వచ్చాడు. అతడక్కడే పడివున్నాడు.

పండ్లవ్యాపారం, హోటళ్ళలో తిండ్లవ్యాపారం చల్లచల్ల పానీయాల వ్యాపారం, పాన్‌సుపారీల వ్యాపారం, పొగచుట్టల సిగరెట్టుల వ్యాపారం సజావుగా సాగుతూనేవుంది.

అతడక్కడే పడిపోయివున్నాడు. అతడికడుపు కదులుతూనేవుంది.

విమానాశ్రయంవద్ద ముఖ్యమంత్రిగారు ఐదు నిముషాలసేపు తనతో కరచాలనం చేసి, చిరునవ్వులతో మాట్లాడి, ఈసారి రాజధాని వచ్చినప్పుడు తనను తప్పకుండా కలవవలసిందని మరీమరీ ఎంతో యిదిగా చెప్పిన వైనాన్ని నెమరువేసుకుని ఉప్పొంగిపోతూకూచున్న బాలమ్మగారి మొహంమీదకు కూలర్‌తాలూకు హిమపవనాలు వీస్తున్నాయి.

అతడక్కడే వున్నాడు. అతడి మొహంమీదకు నిప్పులు చెలరేగే వేడిగాలి వీస్తున్నది.

విజ్ఞానభవన్‌లో, కప్పులోపల దాగిన నియాన్ దీపాల వెన్నెలలో, మెతమెత్తటి తివాసీలపైన, మెరిసే బల్లల ఎదుట కూచుని, ఇయర్‌ఫోన్సు పెట్టుకున్న దేశదేశాల ప్రతినిధులందరూ, సువిశాలమయిన వేదికనుండి – 'ఇది బుద్ధుడిదేశం; ఇది అశోకుడి దేశం; ఇది గాంధీదేశం; ఇది మానవజాతి మనుగడకు ఊపిరిపోసే ధార్మిక భారత దేశం'– అంటూ ముగించిన మంత్రి దేవదాసుగారి మానవతావాదం నిండిన మహత్తర సందేశం విని రెండునిముషాలపాటు కరతాళధ్వనులు చేశారు; చేసి అరుకోర్సుల మొగలాయి డిన్నరుకుపక్రమించారు.

అతడక్కడేవున్నాడు. పడేవున్నాడు.

ముసలాయన జేబులోని ఉత్తరం సాయంతో అయన్నెవరో ఇంటికి చేర్చగా, ఇంట్లో నివారందరూ గొల్లుమని, శైత్యోపచారాలు చేయగా సాయంకాలం ఆరింటికి ఆయన కళ్ళు తెరిచినందుకు వాళ్ళు సంతోషించారు. కాని ఆయన వెంటనే అడిగిన ప్రశ్నవిని మతి చలించిందేమోనని భయపడ్డారు. ఆయన అడిగారు 'అతడేమయ్యాడు?'

అతడు అక్కడే పడి వున్నాడు.

కాని అతడికింక అంబులెన్స్ అక్కర్లేదు.

బాలమ్మల సాయమక్కర్లేదు

దేవదాసుల స్పీచిలక్కర్లేదు.

పోలీసువాళ్ళక్కర్లేదు.

తినడానికి తిండి అక్కర్లేదు.

ఉండడానికి ఇల్లు అక్కర్లేదు.

ప్రణాళికలక్కర్లేదు.

ప్రాజెక్టులక్కర్లేదు.

అతడిని రోజంతా కాల్చుకు తిన్నందుకు సూర్యుడు ఎర్రగా సిగ్గుపడి పడమటింట్లో

దాక్కున్నాడు.

ఎవరో చెప్పాడు, పోలీసువచ్చాడు. అంబులెన్సు వచ్చింది.

ట్రాఫిక్ ఆకుపచ్చగా వెలిగింది.

అంబులెన్స్ వెళ్ళింది.

ఎందుకోమరి ముసలాయన కడుపులో కలుక్కుమంది.

తమతమ అంతరాత్మలవైపు చూపుతున్న వేలువంటి అడ్డంకి కాలిబాట మీద నుండి తొలగినందుగు నాగరికులు సంతోషించారు.

విద్యుద్దీపాల వెన్నెలలో నిగనిగలాడుతూ ఎంతో అందంగావుంది నగరపు నడివీధి.

('జమీన్ రైతు' '67 ఉగాది)